క్లుప్తంగా

సబ్సిడీపై నువ్వుల పంపిణీ

నింద్ర: మండలంలో రబీ సీజన్‌లో నువ్వుల పంట సాగుచేసే రైతులకు వ్యవసాయశాఖ సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. నువ్వులు కావలసిన రైతులు కిలో రూ.102కు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెరువు తూముకు మరమ్మతులు చేయండి



చెరువు తూము నుంచి లీకవుతున్న నీరు

నింద్ర: మండలంలోని కొంబాకం చెరువు తూముకు మరమ్మతులు చేయాలని అత్తూరు గ్రామ రైతులు కోరుతున్నారు. గత నాలుగేళ్లుగా చెరువు తూము మరమ్మతులు నోచుకోలేదు. దీంతో చెరువులో నీరు చేరితే తూము ద్వారా లీకేజీ అయి పంట పొలాలు మునిగిపోతున్నాయి. రైతులు కష్టపడి సాగు చేసిన పంటలు నష్టపోతున్నారు. గతంలో సంబంధిత ఇరిగేషన్ అధికారులకు విన్నవించినా మరమ్మతులు చేయలేదు. నేడు చెరువులో నీరు ఉండడంతో తూము ద్వారా ఆ పొలాల్లోకి వచ్చేస్తోంది. దీంతో వరి పంట తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాంప్రసాద్ గౌడ్



నింద్ర: మండల బీజేపీ అధ్యక్షులుగా రాంప్రసాద్ గౌడ్‌ను పార్టీ ఎన్నికల అధికారి మునికృష్ణమనాయుడు గురువారం ప్రకటించారు. మండలంలోని కొప్పేడు పంచాయతీ వేదాంతపురం గ్రామానికి చెందిన రాంప్రసాద్ గౌడ్‌ను మండల అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిలకం ఈశ్వరప్రసాద్‌రెడ్డి, రమేష్‌నాయుడు, రామూర్తియాదవ్, కైలాసం, రాము పాల్గొన్నారు.

నేత్రదేవతకు వెండి పాత్రల వితరణ



వెండిపాత్రలు అందిస్తున్న దాతలు

నగరి : మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలోని నేత్రదేవత దేశమ్మ ఆలయానికి పసుపు, కుంకుమల వెండిపాత్రలను దాతలు దుర్గాప్రసాద్ రెడ్డి, పూజ వితరణగా అందించారు. ఆలయానికి గురువారం విచ్చేసిన వారు 600 గ్రాముల వెండి పాత్రలను ఆలయ అర్చకులు నీలకంఠం, గుణశేఖర్, చెంచయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మోహన కృష్ణ, సుబ్బయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి పెద్ద పీట



ట్యాంకును శుభ్రం చేస్తున్న కూలీ

శ్రీరంగరాజపురం: పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగుకు పెద్దపీట వేస్తున్నట్లు సర్పంచ్ వరదమ్మ తెలిపారు. గురువారం మండలంలోని తయ్యూరు గ్రామ పంచాయతీ గ్రామాలన్నింటా ఓవర్‌హెడ్ ట్యాంకులను శుభ్రం చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్న ట్లు ఆమె చెప్పారు. వర్షాల నేపథ్యంలో గ్రామా ల్లో కాలువల్లో పేరుకపోయిన మురుగు, చెత్తాచెదారాన్ని తొలగించి అంటువ్యాధులు ప్రబలు కుండా చేస్తున్నామన్నారు. ఉత్తమ పంచాయతీగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోత్స్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు జిల్లాలో 325 మంది మగ్గాలు కలిగి చేనేత కార్మికులు ఉండగా 1,200 మంది ఈ వృత్తిపై పరోక్షంగా ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు. జిల్లాలో 13 మండలాల్లో చేనేత కార్మికులుండగా, ప్రధానంగా నగరి, పెనుమూరు, కార్వేటినగరం మండలాల్లో ఎక్కువగా ఉన్నారు. పాలకులు చేనేతను చిన్నచూపు చూడడంతో చాలా మంది జీవనోపాధి కోసం ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకున్నారు. మరికొందరు నమ్ముకున్న కుల వృత్తిని వదల్లేక ఇదే రంగంలో కొనసాగుతున్నారు.

చేనేతకు చేయూత కరువు



- నేతన్నలకు అందని సర్కారు సాయం
- మూతపడుతున్న మగ్గాలు
- నేత కార్మికులకు అండగా నిలిచిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అప్పట్లో నేతన్న నేస్తంతో ఏటా రూ.24 వేల చొప్పున సాయం
- రూపాయి కూడా విదల్చని చంద్రబాబు

కార్వేటినగరం: చేనేత రంగానికి గత సీఎం జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. సొంత మగ్గం ఉన్న నేత కార్మికుల కుటుంబాలకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద నెలకు రూ. 2 వేల చొప్పున ఏటా రూ. 24.000 ఆర్థిక సాయం అందజేశారు. ఐదేళ్లలో సరాసరి చిత్తూరు జిల్లాలో 194 చేనేత కుటుంబాలకు రూ.2.20 కోట్ల సాయం అందింది. నేతన్న నేస్తంతో పాటు ఆయా కుటుంబాల్లోని అర్హత కలిగిన తల్లులకు అమ్మ ఒడి, చేయూత, పింఛన్, వాహనమిత్ర, ఆరోగ్యశ్రీ..తదితర పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి లక్షలాది రూపాయల సాయం అందింది. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో చేనేత సంఘాల రుణాల మాఫీ చేయడంతో పాటు పావలా వడ్డీకే రుణ సదుపాయం, కార్మికులకు 50 ఏళ్లకే పింఛన్ ఇత్యాదివి అమలు చేస్తే తండ్రి బాటలోనే ఆయన తనయుడు సైతం జగన్‌మోహన్‌రెడ్డి నేతన్నలను ఆదుకుంటూ వచ్చారు.

మూత పడుతున్న మగ్గాలు

చేనేత కార్మికులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎన్‌టీ రామారావు హయాం నాటి చీర–ధోవతి పథకాన్ని పునరుద్ధరిస్తానమని, చేనేత ఉత్పత్తులపై 90 శాతం రిబేటు ఇస్తామంటూ 2024 ఎన్నికల ముందు హామీలిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తలేదు. కూటమి ప్రభుత్వం తమకు మేలు చేసే దిశగా కార్యక్రమాలు అమలు చేయడం లేదని నేత కార్మికులు మండిపడుతున్నారు. ఇతర సంక్షేమ పథకాల లబ్ధి లేకపోవడంతో చేనేత కుటుంబాలు అప్పులబాట పడుతున్నాయి. చాలా మంది కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతున్నారు. చాలా మంది నేత పనికి స్వస్తి పలికి వ్యవసాయ కూలీలుగా, ఇతర పనులకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

చేనేత కార్మికుల డిమాండ్లు

- చేనేత కార్మికులకు రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3వేల కోట్లు కేటాయించాలి
- చేనేత వస్త్ర ఉత్పత్తులకు జీరో జీఎస్టీని అమలు చేయాలి
- నూలు, సిల్క్, జరీలకు జీరో 50 శాతం సబ్సిడీ ఇవ్వాలి
- చేనేత కార్మికులకు ఉచిత ఉద్యుత్ 250 యూనిట్లు ఇవ్వాలి
- చేనేత రంగంలో పనిచేస్తున్న 70 శాతం మంది మహిళలకు ప్రత్యేక పథకాలను అమలు చేయాలి
- చేనేత రంగం అనుబంధ వృత్తుల వారికి సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేయాలి.
- చేనేత కుటుంబాలకు రూ. 5లక్షల వరకు వడ్డీ లేని బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి.
- గృహం, వర్క్ షెడ్ పథకాన్ని అమలు చేయాలి
- ఇల్లు లేని వారికి మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలి
- గతంలో జీవత బీమా సంస్థ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసిన ఇన్సూరెన్స్ పథకాన్ని తిరిగి అమలు చేయాలి
- నేతన్నలకు ఏటా రూ. 36.000 చొప్పున ఇవ్వాలి
- చేనేత మగ్గాలు కలిగిన గ్రామాల్లో నూతన సహకార సంఘాలను ఏర్పాటు చేయాలి
- ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులకు రూ.7లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలి
- రాష్ట్ర చేనేత అభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలి
- 60 ఏళ్లు పైబడిన నేతన్నలకు పెన్షన్ రెట్టింపు చేయాలి
- జీవితకాల అనారోగ్య సమస్యలు ఉన్నవారికి పెన్షన్ రూ. 15000 చొప్పున ఇవ్వాలి

జిల్లా వివరాలు

జిల్లాలోని చేనేత మగ్గాలు ఉన్న కార్మికులు	: 325
చేనేతపై ఆధారపడి జీవించేవారు	: 1200
జిల్లాలో చేనేత కార్మికులు ఉన్న మండలాలు	: 13
జిల్లాలో చేనేత క్లస్టర్	: 1

బడ్జెట్లో కోతలు తగదు



రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగానికి కనీసం ఒక శాతం కేటాయింపు లేకపోవడం దారుణం. గత ప్రభుత్వంలో మగ్గం కలిగిన ప్రతి చేనేత కుటుంబానికి ఏటా రూ.24 వేలు అందించి ఆర్థికంగా ఆదుకుంది. కూటమి ప్రభుత్వం బడ్జెట్లో కోత విధించి నేతన్నలను మోసం చేసింది. అర్హులైన చేనేత కుటుబాలకు రూ. 5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు కల్పించి ఆర్థికంగా తోడ్పాటునివ్వాలి

ఆకుల వాసు, అధ్యక్షుడు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్

కష్టాలు తెలుసన్నారు.. బడ్జెట్లో ముంచారు



చేనేత రంగం అభివృద్ధి కోసం, కార్మికుని ఉపాధి కోసం మరింత మెరుగైన అవకాశాలు రావాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించాం. ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికుల సమస్యలు నాకు తెలుసని, వారికి అండగా ఉంటానని చెప్పి, అధికారంలోకి వచ్చాక నిండా ముంచేశారు. పథకాల ఫలాలు అందక కూలీలుగా మారుతున్నారు.

పీవీ. కృష్ణయ్య, జిల్లా అధ్యక్షుడు, చేనేత కార్మిక యూనియన్, సదుం

నేత కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి



కుల వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న నేత కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి. ఇచ్చిన మాట ప్రకారం 250 యూనిట్లు ఉచితంగా ఇచ్చి, అర్హులైన వారికి గతం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను అమలు చేసి ఆర్థికంగా ఆదుకోవాలి, ఏడాదికి రూ.26 వేలు ఇవ్వాలి. చేనేత మగ్గాలు కలిగిన గ్రామాల్లో నూతన సహకార సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు ఇవ్వాలి. 60 ఏళ్లు పైబడిన వారికి పెన్షన్ రెట్టింపు చేయాలి.

–కందల బాలాజి, చేనేత యూనియన్ జనరల్ సెక్రటరీ, చిత్తూరు జిల్లా

మూలన పడిన మగ్గం



చేనేత పనికి కష్టకాలం దాపురించింది. మగ్గం బాగు చేయించుకునేందుకు డబ్బులు లేక మూలన పడేస్తున్నారు. చిన్నతనం నుంచి నేత పని తప్పితే వేరే తెలియని వారు ఆదరణ లేకపోవడంతో నేతన్నలకు పూట గడవడం కష్టంగా మారింది. మా కష్టాలు ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియలేదు. ప్రభుత్వం సాయం అందించి చేనేత కార్మికులను ఆదుకుని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి.

–ఏ.లత, చేనేత కార్మికురాలు, మాంగాడు, నగరి మండలం

చైన్ స్నాచర్ అరెస్ట్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప

పాలసముద్రం : మండలంలోని కొత్తకండ్రిగలో చైన్ స్నాచర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి బంగారు చైన్, పల్సర్ ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప కథనం మేరకు.. ఆముదాల పంచాయతీ కొత్తకండ్రిగ గ్రామానికి చెందిన టీ విమల కుమారి(బుజ్జి) తాను పోషిస్తున్న ఆవును తీసుకుని పొలానికి బయలుదేరింది. మార్గమధ్యంలో ఓ యువకుడు పల్సర్ మోటారుసైకిల్‌పై వచ్చి, ఆమెను సమీపంలో ఎక్కడైనా పెట్రోల్ దొరుకుతుందా? అని అడిగాడు. అందుకు ఆమె ఆ సమీపంలో దొరుకుతుందని చెబుతుండగా ఆమె మెడలో బంగారు చైన్ లాక్కొని పరారయ్యాడు. బాధితురాలు ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప బలిజకండ్రి – చిత్తూరు రోడ్డులోని టీవీఎస్‌ఆర్ పురం క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో చిత్తూరు నుంచి వస్తున్న మోటారు సైకిల్‌ను ఆపి తనిఖీ చేశాడు. అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా గంగాధరనెల్లూరు మండల ముక్కల్లూరు దళితవాడకు చెందిన లోకనాథం కుమారుడు రామ్కి(24) అని, లోన్ యాప్ తీసుకోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో చోరీలు చేసి డబ్బులు సంపాదించాలని నిర్ణయించుకుని కొత్తకండ్రిగ వద్ద మహిళ మెడలో బొందుచైను లాక్కొని వెళ్లినట్టు అంగీకరించాడు. ఆయన వద్ద రూ.2 లక్షలు విలువ చేసే పల్సర్ ద్విచక్రవాహనం, 28 గ్రాముల బంగారు చైన్ స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, చిత్తూరు కోర్టులో హాజరుపరిచామని తెలిపారు.

28న పుత్తూరులో జాబ్ మేళా

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ వి.వీరయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే మెగా జాబ్ మేళాలో 9 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. జాబ్ మేళాలో ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీటెక్ చదివిన 18 నుంచి 30 ఏళ్ల అభ్యర్థులు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు బయోడేటాతో పాటు సర్టిఫికెట్స్, ఐడీ ప్రూఫ్, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని వివరించారు. ఇతర వివరాలకు 98485 53724 ను సంప్రదించాలని కోరారు.



• బసవడి చిందు... కనువిందు

తెలుగు లోగిళ్లలో పెద్ద పండుగ సంక్రాంతి. ధనుర్మాసంలో వచ్చే సంక్రాంతి పండుగ శోభ.. జోరు గంగిరెద్దుల ఆటలతోనే ప్రారంభమవుతాయి. ధనుర్మాసం ప్రారంభం కావడంతో డూడూ బసవన్నలు దర్శనమిస్తున్నాయి. అయ్యగారికి దండం పెట్టు, అమ్మగారికి దండం పెట్టు అంటూ గంగిరెద్దులోళ్లు భిక్షాటనకు వస్తున్నారు.

– పుత్తూరు

నియోజకవర్గ సమావేశం సూపర్ సక్సెస్

- వర్షంలోనూ అధిక సంఖ్యలో హాజరైన పార్టీ శ్రేణులు
- తప్పుచేసినవారే భయపడాలి : మాజీ మంత్రి ఆర్కే రోజా
- రోజా అంటే ఫ్లవర్‌కాదు వైల్డ్ ఫైర్ : భూమన కరుణాకర రెడ్డి



సమావేశంలో వైఎస్సార్‌కు నివాళి అర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి, భూమన, రోజా

నగరి : ఎన్నికల అనంతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగరిలోని ఏజేఎస్ కల్యాణ మండపంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశం సూపర్ సక్సెస్ అయింది. గురువారం ఉదయం జోరు వర్షం కురుస్తున్నా లెక్కచేయక పార్టీ శ్రేణులు భారీఎత్తున వచ్చారు. కల్యాణ మండపం పార్టీ శ్రేణులతో కళకళలాడింది. కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి దిశా నిర్దేశం ఇవ్వడానికి ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి మాజీ మంత్రి ఆర్కేరోజా అధ్యక్షత వహించగా చిత్తూరు ఉమ్మడి జిల్లా అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి, ఎంపీ గురుమూర్తి, మాజీ ఎంపీ రెడ్డెప్ప ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తొలుత మహానేత వైఎస్సార్‌కు నివాళులర్పించి సమావేశాన్ని ప్రారంభించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ ప్రజలు మోసపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు కట్టించిందని, ఆస్పత్రులను నవీకరించిందని, విద్యావ్యవస్థలో పెనుమార్పులు తీసుకువచ్చింది తప్ప పాలనలో ఎలాంటి తప్పుడు పనులు చేయలేదన్నారు. సంక్షేమ పథకాలను ఇంటికే చేర్చింది తప్ప మోసాలకు పాల్పడలేదన్నారు. మంచి చేసిన మనం తలెత్తుకుని తిరగాలి తప్ప భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన వారు భయపడాలన్నారు. భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ రోజా అంటే ఫ్లవర్ కాదని వైల్డ్ ఫైర్ అని అన్నారు. ప్రత్యర్థుల గుండెల్లో రోజా నిప్పుల కుంపటి అన్నారు. అలాంటి నేత అడుగుజాడల్లో పనిచేసే వారు ఏ విషయంలోనూ వెనకడుగు వేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సోదరులు కుమారస్వామిరెడ్డి, రామ్‌ప్రసాద్ రెడ్డి, నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు నీలమేఘం, హరి, జెడ్పీటీసీ సభ్యులు గాంధీ, నగరి, నింద్ర, పుత్తూరు, వడమాలపేట ఎంపీపీలు భార్గవి, దీప, మునివేలు, విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు జయప్రకాష్, వెంకటరత్నం రెడ్డి, బాలన్, శంకర్, వైస్ ఎంపీపీలు కన్నియప్ప, డిల్లి, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి రోజా

కార్పొరేషన్‌లో చేతివృత్తులపై ఉచిత శిక్షణ

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఆసక్తి ఉన్న నిరుద్యోగులకు చేతివృత్తులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కమిషనర్ నరసింహ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, వడ్రంగి, ఎలక్ట్రీషియన్, టీవీ–వాషింగ్‌మెషీన్–ఏసీ రిపేర్లు, బ్యూటీషియన్ లాంటి ఏ రంగంలో ఆసక్తి ఉంటే.. అందులో ఉచిత శిక్షణ ఇవ్వడంతోపాటు అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు శనివారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు కార్పొరేషన్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్–7780285604ను సంప్రదించాలని కోరారు.

రైల్వే గేటు మూసివేత!



పుత్తూరులో మూసివేసిన రైల్వే గేటు

పుత్తూరు: పట్టణంలోని ఆర్డీఎం వద్ద గల రైల్వేగేట్ రెండు రోజులుగా మూసివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతుల పేరిట తరచూ రైల్వేగేట్ నెంబర్ 56ను మూసివేస్తుండడంతో ప్రయాణికుల పాట్లు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఈ గేట్ వద్ద మ్యానువల్ లిఫ్ట్ గేటును ఎంతో కాలంగా వినియోగిస్తున్నారు. ఇటీవల ఎలక్ట్రికల్ లిఫ్ట్ గేట్‌ను ఏర్పాటు చేసి ఉంచారు. ఈ నెల 25వ తేదీ తెల్లవారుజాము నుంచి ఎలక్ట్రికల్ లిఫ్ట్ గేట్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి పాత మ్యానువల్ గేట్‌ను తొలగించే క్రమంలో గేట్‌ను నిరవధికంగా మూసివేశారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి–చెన్నై జాతీయ రహదారి మధ్యలో ఉన్న ఈ గేటు మూసివేత కారణంగా పలు వాహనాలు బారులు తీరి నిలిచిపోతున్నాయి. రైలు వెళ్లిన తర్వాత కూడా గేటు తీయరు అనే విషయం బోధపడ్డాక వాహనదారులు మరోమార్గం ద్వారా వెళుతున్నారు. దీంతో కనీసం 4 కి.మీ అదనంగా ప్రయాణించాల్సి వస్తోంది. మరమ్మతుల నేపథ్యంలో గేటును తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు పత్రికల ద్వారా ప్రజలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకపోవడంపై రైల్వే అధికారుల వ్యవహార శైలిపై ప్రజలు మండిపడుతున్నారు. మరమ్మతులను ఎప్పటికి పూర్తి చేసి, రాకపోకలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు గేట్ నెంబర్ 56 వద్ద గల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



విషయం తెలియక వేచి ఉన్న వాహనదారులు

పోరుబాట విజయవంతం చేయండి

కార్వేటినగరం: పార్టీ అధిష్టానం పిలుపు మేరకు విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ శుక్రవారం నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ శేఖర్‌రాజు పిలుపునిచ్చారు. ఆరు మండలాల నుంచి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని ప్రజలకు హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంపుతో బాదుడు మొదలెట్టారని విమర్శించారు. దీనికి నిరసనగా స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. తొలుత స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ఆర్చి నుంచి మండల కార్యాలయ సముదాయం వరకు నియోజకవర్గ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి ఏడీఈకి వినతి పత్రం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆరు మండలాల్లోని వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నిరసన జయప్రదం చేయండి

శ్రీరంగరాజపురం: కార్వేటినగరం మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించే పోరుబాటను జయప్రదం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మణి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలలు గడవకముందే ప్రజలపై విద్యుత్ చార్జీల పెంపుతో బాదుడు మొదలెట్టిందని, దీనికి నిరసనగా పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఆందోళన చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మోగిన ఎన్నికల నగారా

చిత్తూరు అర్బన్: చిత్తూరు న్యాయవాద సంఘం (బార్) ఎన్నికల నగారా మోగింది. నగరంలోని జిల్లా న్యాయస్థానాల సముదాయంలో పనిచేస్తున్న న్యాయవాదుల సంఘానికి ఎన్నికలు నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కావడం, పూర్తవడం కూడా జరిగిపోయింది. బార్ అసోసియేషన్‌లో మొత్తం 12 పోస్టులుండగా అధ్యక్ష, కార్యదర్శితో సహా 28 మంది న్యాయవాదులు నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి, బరిలో ఉన్న న్యాయవాదుల వివరాలు ప్రకటిస్తారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక.. అదే రోజు తుదిగా బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు ప్రకటించనున్నట్టు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది వసంతకుమార్ తెలిపారు. జనవరి 3వ తేదీన బార్ అసోసియేషన్‌కు ఎన్నికలు, అదే రోజు ఫలితాల వెల్లడించనున్నారు. ఈ అసోసియేషన్‌లో దాదాపు 339 మంది ఓటర్లుగా ఉన్నారు. ఎన్నికల ప్రక్రియను బార్ కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, మరో న్యాయవాది రఘురామ్ పర్యవేక్షించారు.